ప్రజాశక్తి
సోమవారం 5 జూన్ 2023
5
శ్రీకాకుళం



రైలు ప్రమాద మృతులకు నివాళి



ప్రజాశక్తి - కవిటి

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యాన కవిటిలో ఆదివారం అశ్రునివాళి అర్పించారు. యువజన సంఘం సభ్యులు, యువకులు కొవ్వొత్తులు చేత పట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం కవిటి బస్టాండ్‌లో మానవహారం నిర్వహించి అంజలి ఘటించారు.

రైతుల భూముల్లోకి 'రియల్' మాఫియా

- పాకల తొలగింపునకు యత్నం
- వెనక ఉండి కథ నడిపిస్తున్న వ్యాపారులు
- సహకరిస్తున్న పోలీసులు

తరతరాలుగా సాగు చేసుకుంటున్న రైతులను వారి భూముల నుంచి వెళ్లగొట్టించేందుకు రియల్ మాఫియా మూడేళ్లుగా రకరకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రైతులను దారిలోకి తెచ్చుకునేందుకు సామ దాన బేధ దండోపాయాలను ప్రయోగించారు. అదిరించి, బెదిరించి లొంగదీసుకోవాలని చూశారు. డబ్బులు ఎర చూపి ప్రలోభాలకూ గురిచేశారు. ఆ ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో జిల్లా కోర్టు ఇంజక్షన్ ఆర్డర్‌ను అడ్డం పెట్టుకుని గతేడాది జూన్‌లో జెసిబిలు, ప్రొక్లెయినర్లతో రైతుల తోటలను ధ్వంసం చేశారు. దీనిపై రైతులు అదే నెలలో హైకోర్టును ఆశ్రయించగా స్టే విధించింది. వారు సాగు చేసుకుంటున్న భూముల్లో వేసిన పాకలను తొలగించేందుకు శనివారం మరోసారి మాఫియా ప్రయత్నించింది. అడ్డుకోవాల్సిన పోలీసులు పాకలను తొలగించాలంటూ రైతులను హెచ్చరించడం తీవ్ర విమర్శలకు దారితీసింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళంకు చెందిన బొంత సాంబశివరావు, భమిడిపాటి పెద్ద సన్యాసిరావు, చీమలకొండ అప్పయ్య పేరుతో విశాఖపట్నం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 28 ఎకరాల ఇనాం భూమి 1904, అక్టోబరు 18న రిజిస్టర్ అయింది. అదే భూమిని వారు 1904లో అంధవరపు కిష్టమ్మ, చల్ల నారాయణరావుకు అమ్మినట్లు రికార్డులు చెప్తున్నాయి. శ్రీకాకుళం నగరంలోకి ఆస్తులను చల్లా నారాయణరావుకు అప్పగించి, నారాయణపురం కొండపై భూములపై హక్కుదారునిగా ఒప్పందం చేసుకున్నాడు. 2012లో ఎచ్చెర్ల తహశీల్దార్ ఇచ్చిన భూముల అప్పగింత లేఖ అందుకు విరుద్ధంగా ఉంది. బొంత సాంబశివరావు, భమిటిపాటి పెద్ద సన్యాసిరావు, చీమలకొండ అప్పయ్య ఇనామ్‌దారుల నుంచి అంధవరపు కిష్టమ్మ 83 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లుగా, మరణాంతరం అంధవరపు గోవిందరాజులు, వారి కుమారులకు దఖలు పడినట్లు పేర్కొన్నారు. గోవిందరాజుల కుటుంబం 28 ఎకరాలు కొనుగోలు చేస్తే, అది 83 ఎకరాలుగా ఎలా మారిందనేది ప్రశ్నార్థకంగా మారింది. గోవిందరాజుల కుమారుల్లో అంధవరపు వెంకట అప్పారావు, అంధవరపు కృష్ణమూర్తి 30.54 ఎకరాలు తమవేనని శ్రీకాకుళం సివిల్ కోర్టులో కేసు వేశారు. దీనిపై గతేడాది మార్చి మూడో తేదీన కోర్టు మధ్యంతర ఇంజక్షన్ ఆర్డర్ జారీ చేసింది.



పాకల తొలగింపును అడ్డుకుంటున్న రైతులు

కోర్టు కేసులు లేకున్నా పాకల తొలగింపునకు యత్నం

కోర్టు ఉత్తర్వులు గతేడాది మార్చిలోనే వెలువడినా అప్పటివరకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూముల దగ్గరకు రాలేదు. రైతులు హైకోర్టును ఆశ్రయించారన్న సమాచారంతో గతేడాది జూన్ ఎనిమిదో తేదీన ఆగమేఘాల మీద భూముల స్వాధీనం చేసుకున్నారు. హైకోర్టు ఉత్తర్వుల పరిణామాలు ఎలా ఉంటాయోనని ముందుగానే పనికానిచ్చేసేలా పథకం అమలు చేశారు. దీనిపై రైతులు అదే నెలలో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై యధాతథ స్థితిని కొనసాగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రైతుల తోటలను ధ్వంసం చేసి భూములు ఆక్రమించుకుంటున్నారని కోర్టును ఆశ్రయించడం మినహా భూములపై అప్పటివరకు ఎటువంటి కేసులు లేవని రైతులు చెప్తున్నారు. పోలీసులు పాకలు తొలగించాలని హెచ్చరించడంపై రైతులు మండిపడుతున్నారు.

పోలీసుల తీరుపై విమర్శల వెల్లువ

నారాయణపురం భూముల విషయంలో పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల పక్షాన నిలబడాల్సిన పోలీసులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సహకరించేలా పనిచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. భూములపై కేసులు ఉన్నాయని, పాకలు తొలగించాలంటూ పోలీసులు రైతులను హెచ్చరించడం విచిత్రంగా ఉంది. భూముల అంశంపై న్యాయ వివాదాలు ఉంటే రియల్ మాఫియాకు చెందిన వ్యక్తులు జెసిబిలతో భూముల్లోకి ఎలా వచ్చారన్నది ప్రశ్నార్థకంగా ఉంది. భూములపై నిజంగా కేసులుంటే తహశీల్దార్ సమక్షంలో వాటిని తొలగించాల్సి ఉంది. జెసిబిలతో వచ్చిన బయట వ్యక్తులకు పోలీసులు రక్షణ కల్పించడం అనేక విమర్శలకు తావిస్తోంది.

భూములను ఆక్రమించాలని చూస్తున్నారు



నారాయణపురం భూములను మరోసారి ఆక్రమించాలని అంధవరపు కుటుంబసభ్యులు ప్రయత్నిస్తున్నారు. గతేడాది జూన్‌లో మా తోటలను ధ్వంసం చేసి, భూములు తీసుకుంటారనే భయంతో హైకోర్టులో కేసు వేశాం. దానిపై కోర్టు స్టే ఇచ్చింది తప్ప భూములపై ఎటువంటి కేసుల్లేవు. తరతరాలుగా మా సాగులో ఉన్నాయి. అందుకే పాకలు వేసుకున్నాం.

- టి.నందోడు, చిలకపాలెం

మా భూముల్లోనే పాకలు వేసుకున్నాం



మా తాత తండ్రుల నుంచి సాగు చేసుకుంటున్న భూముల్లోనే పశువుల కోసం పాకలు వేసుకున్నాం. రియల్ ఎస్టేట్ వ్యాపారుల మనుషులు మా భూముల్లోకి వచ్చి దౌర్జన్యం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మాకు సాగుహక్కు పత్రాలు ఇవ్వాలి.

- కె.అప్పన్న, చిలకపాలెం

పిడుగుపాటుకు మహిళ మృతి

- లాభాంలో విషాదఛాయలు
- పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో వర్షం

ప్రజాశక్తి - బూర్జ, కోటబొమ్మాళి, పలాస

పిడుగుపాటుకు బూర్జ మండలం లాభాంకు చెందిన నక్క పద్మావతి (45) ఆదివారం మృతి చెందింది. ఆమెతో పాటు ఆవు కూడా మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పద్మావతి భర్త చిన్న రామయ్య మూడు నెలల కిందట అనారోగ్యంతో మృతి చెందడంతో జీవనాధారం లేక ఆవును కొనుగోలు చేసింది. ఎప్పట్లాగే మేత కోసం ఆవును తీసుకొని చెరువుకు వెళ్లింది. ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసిన సమయంలో పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, ఆవు కూడా మృత్యువాత పడింది. సాయంత్రం అటువైపు వెళ్లిన గ్రామస్తుడు కొండపల్లి వాసు మృతి చెందిన పద్మావతిని చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ అశోక్‌బాబు, రెవెన్యూ సిబ్బంది పంచనామా నిర్వహించిన మృతదేహాన్ని పాలకొండ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆదివారం ఉదయం నుంచీ ఎండ తీవ్రత, ఉక్కపోతతో అల్లాడిన జనాలపై సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పోలాకి, నరసన్నపేట, జలుమూరు, కోటబొమ్మాళి, టెక్కలి, పలాస తదితర ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి భారీ వర్షం కురిసింది. భారీగా వీచిన ఈదురుగాలులకు మామిడి నేలరాలగా, అరటి చెట్లు నేలవాలాయి. ఈదురుగాలులతో భారీ వర్షం కురవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గాలులు, వర్షం తగ్గాక విద్యుత్‌ను పునరుద్ధరించారు.



పిడుగుపాటుకు మృతి చెందిన పద్మావతి, ఆవు

బదిలీలకు నేటి నుంచి వెబ్ ఆప్షన్లు

శ్రీకాకుళం ప్రతినిధి : ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి నేటి నుంచి వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలు కానుంది. ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం ఆరో తేదీ వరకు ప్రధానోపాధ్యాయులకు ఆప్షన్లను ఎంపిక చేసుకోవచ్చు. స్కూల్ అసిస్టెంట్లకు ఐదు నుంచి ఏడో తేదీ వరకు మూడు రోజులు ఆప్షన్‌ను నమోదు చేయొచ్చు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఐదు నుంచి ఎనిమిదో తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించింది. షెడ్యూల్‌లో భాగంగా విద్యాశాఖ అధికారులు ఖాళీలను ప్రదర్శించారు. గత నెల 24 నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. 25 నుంచి 27వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. 28, 29 తేదీల్లో ప్రాథమిక సీనియారిటీ జాబితాలను ప్రదర్శించారు. 30న అభ్యంతరాలను స్వీకరించి 31 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు అభ్యంతరాలను పరిష్కరించారు. 2, 3 తేదీల్లో తుది సీనియారిటీ జాబితాలు ప్రకటించారు.

మానవత్వం చాటిన యువత

రెడ్‌క్రాస్‌లో 30 మంది రక్తదానం




రక్తదానం చేస్తున్న యువకుడు

శ్రీకాకుళం : ఒడిశా రాష్ట్రంలోని బాలేశ్వర్‌లో రైలు ప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారికి అవసరమైన రక్తం అందించేందుకు యువత ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకున్నారు. కష్టంలో ఉన్న వారి కోసం రక్తాన్ని దానం చేసి ప్రశంసలు అందుకున్నారు. నగరంలోని హయాతీనగరం, రెల్లివీధి, పెద్దరెల్లివీధికి చెందిన 30 మంది యువకులు స్వచ్ఛందంగా రెడ్‌క్రాస్‌లో రక్తదానం చేశారు. రైలు ప్రమాద ఘటనలో గాయపడిన వందలాది మందికి అత్యవసర వైద్యనిమిత్తం రక్తం అవసరమని, జిల్లాలో యువత ముందుకు వచ్చి రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.జగన్మోహనరావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రెల్లివీధి పెద్దలు జలగడుగుల శ్రీరాములు, 23వ డివిజన్ టిడిపి వార్డు ఇన్‌ఛార్జి కళ్యాణి వెంకటరావు, అరుగుల గణేష్, కళ్యాణి కూర్మారావు, కళ్యాణి జ్యోతి ప్రసాద్, ఆకుల సురేష్‌కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె.సత్యనారాయణ, పి.చైతన్య కుమార్, బి.చిన్మయరావు, రెడ్‌క్రాస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి అతిసార నివారణ పక్షోత్సవాలు

శ్రీకాకుళం : ఐదేళ్ల లోపు చిన్నారుల్లో అతిసార వ్యాధి నివారణ ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు అతిసార నివారణ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు, అంగన్వాడీ స్కూళ్లకు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు ఒఆర్ఎస్, జింకు మాత్రలు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. ఈ పక్షోత్సవాల్లో తల్లులకు, కుటుంబ సభ్యులకు అతిసార, చికిత్స విధానాలపై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆశాను గానీ, ఎఎన్ఎం గానీ సంప్రదించి వారు సూచించిన విధంగా ఒఆర్ఎస్, జింక్‌లను ఇవ్వాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఆర్.వి.ఎస్ కుమార్ తెలిపారు.


ఐటిఐల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు



రామ్మోహన్‌రావు

శ్రీకాకుళం ప్రతినిధి : 2023-24 విద్యా సంవత్సరంలో ఐటిఐల్లో చేరాలనుకునే విద్యార్థులు ఈనెల ఆరో తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని గవర్నమెంట్ డిఎల్‌టిసి అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామ్మోహన్‌రావు తెలిపారు. విద్యార్థులు iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తమకు సమీపంలోని ఏదైనా ప్రభుత్వ ఐటిఐకి వెళ్లి సర్టిఫికేట్ల పరిశీలన చేయించాలన్నారు. అలా చేయని పక్షంలో విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలవబోమని స్పష్టం చేశారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం విద్యార్థులు తమ వెంట ఎస్ఎస్‌సి, కుల ధ్రువీకరణ, టిసి, స్టడీ, ఆధార్ ఒరిజనల్ సర్టిఫికేట్లను తీసుకురావాలని సూచించారు.

వేసవి వినోదంలో చిన్నారుల సందడి



పెయింటింగ్ వేస్తున్న చిన్నారులు

శ్రీకాకుళం ప్రతినిధి : శ్రీకాకుళం నగరంలోని తుమ్మా వీధిలో నిర్వహించిన వేసవి వినోదం కార్యక్రమంలో చిన్నారులు సందడి చేశారు. నగరానికి చెందిన క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న వేసవి వినోదం తొలి రోజు ఆదివారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన పెయింటింగ్, డ్రాయింగ్ వేశారు. కొందరు చిన్నారులు వేమన పద్యాలు, వాటి భావాన్ని చక్కగా వివరించారు. తెలుగు, ఇంగ్లీషు భాషల్లో కథలు చెప్పారు. బాలలకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పప్పల సత్యనారాయణ, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం బాధ్యులు వి.జి.కె మూర్తి, క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై దాడులు

- సైకో చర్యలకు సమాధి తప్పదు
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ప్రజా సమస్యలపై ప్రశ్నించే వారిపై వైసిపి ప్రభుత్వం దాడులు చేస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. నిమ్మాడలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో చర్యలకు సమాధి కట్టే రోజులు దగ్గర పడ్డాయన్నారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట నారాయణరెడ్డిపై గుర్తు తెలియని పది మంది వ్యక్తులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న వారిపై దాడులు చేయడం అప్రజాస్వామికమన్నారు. జగన్ తీరు చూస్తుంటే జర్మనీలో నాజీ దురాగతాలు గుర్తుకొస్తున్నాయన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, విమర్శించటం నేరామా అని ప్రశ్నించారు. ప్రశ్నించే వారిని వేధించడం, అణచివేయడం జగన్ పాలనలో సాగుతుందని చెప్పారు. రాష్ట్రంలో రూల్ ఆఫ్ లా అమలవుతుందా అని హైకోర్టు పదే పదే ప్రశ్నించడమంటే శాంతిభద్రతల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుందన్నారు. ఫ్యాక్షన్ రాజకీయాలు, దౌర్జన్యాలు, దోపిడీ విధానాన్ని కొనసాగిస్తూ రాష్ట్రాన్ని నేరగాళ్ల అడ్డాగా మార్చారని ఆరోపించారు. జగన్ ప్రభుత్వ దమనకాండకు ముగింపు పలికే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వెంకట నారాయణరెడ్డిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, ఆయనకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఐఐహెచ్‌టిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి)లో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ఒఎస్‌డి జి.వెంకటరాం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీలో మూడేళ్ల డిప్లమో కోర్సులో ప్రవేశాలకు తిరుపతి జిల్లా వెంకటగిరిలో గల ఐఐహెచ్‌టిలో 53 సీట్లు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లు, కర్ణాటకలోని గడగ్‌లో నాలుగు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కోర్సులకు ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఇందుకు పదో తరగతి లేదా తత్సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలని స్పష్టం చేశారు. దరఖాస్తు చేసే బిసి, జనరల్ కేటగిరీ అభ్యర్థులు 2023 జులై ఒకటో తేదీ నాటికి 15 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు గల వారై ఉండాలని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టిలకు 25 ఏళ్ల వరకు అనుమతించనున్నట్లు తెలిపారు. ఇంటర్ ఎంపిసి, ఒకేషనల్ (టెక్స్‌టైల్స్), రెండేళ్ల ఐటిఐ పూర్తి చేసిన వారు నేరుగా రెండో సంవత్సరంలోకి ప్రవేశించవచ్చని, వీరి కోసం 52 సీట్లు కేటాయించినట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతు దగా ప్రభుత్వం

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి - సరుబుజ్జిలి



ఏరువాకలో దుక్కి దున్నుతున్న రవికుమార్

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం రైతులను దగా చేస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. మండలంలోని సింధువాడలో ఏరువాక కార్యక్రమంలో భాగంగా ఆదివారం పొలంలో నాగలి చేతపట్టి దుక్కి దున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగువారి సంప్రదాయం ఏరువాక పౌర్ణమి కార్యక్రమంతో రైతులు సుభిక్షంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని విమర్శించారు. 2014లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే నాటికి విభజన ఆంధ్రప్రదేశ్ రూ.16,500 కోట్ల లోటు బడ్జెట్‌లో ఉన్నా రూ.27 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేసిందని గుర్తు చేశారు. రైతు రథాలు, వరి కోత యంత్రాలు, వ్యవసాయ పరికరాలు, సబ్సిడీపై ఎరువులు, పురుగు మందులు తదితర వాటిని పంపిణీ చేసినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక సబ్సిడీతో కూడిన వ్యవసాయ పరికరాలు ఒక్కటైనా రైతులకు ఇచ్చారా అని ప్రశ్నించారు. కనీసం రైతులకు తడిచిన ధాన్యాన్ని ఎండబెట్టేందుకు వినియోగించే టార్పాలిన్లనూ ఇవ్వలేని దిక్కుమాలిన ప్రభుత్వమని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ఊకదంపుడు ఉపన్యాసాలు ఇవ్వడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. మహానాడులో రైతుబంధు పథకం ద్వారా రైతులకు సంవత్సరానికి రూ.20 వేలు ఇస్తామని ప్రకటించేసరికి వైసిపి నాయకులు గిలగిలా కొట్టుకుంటున్నారని చెప్పారు. వైసిపి మేనిఫెస్టోలో ప్రతి నియోజకవర్గంలో కోల్డ్ స్టోరేజ్‌లు, గిడ్డంగులు నిర్మిస్తామని హామీ ఇచ్చారని, ఎక్కడ నిర్మించారో కానరావడం లేదని విమర్శించారు.

స్పీకర్ తమ్మినేని సీతారాం గడప గడపకు వెళ్తూ మేనిఫెస్టోలోని 98 శాతం హామీలను నెరవేర్చామని చెప్తున్నారని, అదంతా బోగస్ అన్నారు. జెడ్ ప్లస్ కేటగిరీ తీసేస్తే చంద్రబాబు ఫినిష్ అని తమ్మినేని మతిస్థిమితం లేని వ్యక్తి మాట్లాడినట్టు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారని చెప్పారు. రాజ్యాంగబద్ధ స్పీకర్ స్థానానికి ఉన్న ప్రతిష్ఠను తమ్మినేని మంటగలిపారని ధ్వజమెత్తారు. తొగరాంలో మంజూరు చేసిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను టిడిపి అధికారంలోకి రాగానే వెన్నెలవలసకు గానీ పెద్దపేటకు గానీ తరలిస్తామన్నారు. విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ను ఇసుక దిబ్బల మీద నిర్వహించలేమని, అందుకే తరలింపు అనివార్యమన్నారు. రైతు దగా ప్రభుత్వాన్ని తరిమికొట్టి తెలుగుదేశం పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివ్వాల సూర్యం, మీసాల రామారావు, పల్లి సురేష్, తర్లాడ సురేంద్ర, తాడేల రమణ, యండ రామారావు, కూన గణపతి, కొర్ను సూర్యనారాయణ, బి.వి రమణమూర్తి, చిన్నాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకు తొలుత సాగునీరు

- మూడో వారంలో 'వంశధార' నీరు విడుదల
- సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు
- వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు





ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తొలుత శివారు భూములకు సాగునీరు విడిచిపెట్టేలా చర్యలు చేపడుతున్నామని వంశధార ఎస్ఇ డోల తిరుమలరావు చెప్పారు. గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. కాలువల్లో నీరు సాఫీ సాగేలా చూడడం ద్వారా లక్ష్యం మేరకు నీటిని అందించే అవకాశం ఉందన్నారు. కాలువల సామర్థ్యం మేరకు నీరు వదిలేలా చూస్తున్నామన్నారు. గతంలో నరసన్నపేటలో చోటుచేసుకున్న షట్టర్ల అవినీతి కేసు కోర్టులో పెండింగ్‌లో ఉండడంతో కొత్తవి ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొందని, దీంతో శివారు భూముల వరకు నీరు వెళ్లడం కొంత కష్టంగా మారిందని అభిప్రాయపడ్డారు. తమ పరిధిలో ఉన్న అంశాల మేరకు సమస్యలను పరిష్కరించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని చెప్పారు. పలు అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

గత ఖరీఫ్‌లో శివారు భూములకు వంశధార నీరందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. నీరు లేక పంటలు వేయలేకపోవడం, చివరి దశలో పంటలు ఎండిపోయిన పరిస్థితిని చూశాం. వీటిని అధిగమించేందుకు ఎటువంటి చర్యలు చేపట్టనున్నారు?

గతేడాది జులై ఎనిమిదో తేదీన వంశధార నీటిని విడిచిపెట్టాం. దీంతో శివారు భూముల రైతులు కొంత ఇబ్బంది పడ్డారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది జూన్ మూడో వారంలో నీటిని విడిచిపెట్టి శివారు భూములకు తొలుత ఇవ్వాలనుకుంటున్నాం. గొట్టాబ్యారేజీలో 0.5 టిఎంసి మేర నీరు ఉంది. వారం, పది రోజుల్లో వర్షాలు పడితే నీటిని విడుదల చేస్తాం.

శివారు భూములకు సాగు నీరందకపోవడానికి కాలువల్లో పెద్దఎత్తున పేరుకుపోవడమే కారణమన్న విమర్శలున్నాయి. సాగు నీరు సాఫీగా సాగేందుకు ఏం చేయాలనుకుంటున్నారు?

కాలువల్లో గుర్రపుడెక్క పెద్దఎత్తున పెరగడంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తిందన్న మాట వాస్తవమే. గుర్రపుడెక్క తొలగింపునకు రూ.50 లక్షల వరకు నిధులు అవసరమవుతాయి. నిధులు కావాలని కలెక్టర్‌ను అడిగితే, సానుకూలంగా స్పందించారు. నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

వంశధార కాలువల్లో పూడిక బాగా పేరుకుపోవడం, కొన్నిచోట్ల స్ట్రక్చర్స్ దెబ్బతినడంతో సాగునీటి ప్రవాహానికి ప్రధాన సమస్యగా ఉన్నట్లు తెలుస్తోంది. పూడికతీత పనులు, మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారా?

వంశధారలో పూడికతీత, రెగ్యులేటర్లు, స్లూయిజ్‌ల మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఎడమ కాలువ కోసం రూ.5.50 కోట్లు, కుడి కాలువకు రూ.4.50 కోట్లు అవసరమవుతాయి. ప్రభుత్వం అమోదం తెలిపిన వెంటనే పనులు చేపడతాం.

వంశధార కాలువలు పటిష్టంగా లేకపోవడంతో సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడం, శివారు భూములపై దాని ప్రభావం పడుతోందని తెలుస్తోంది. దీన్ని ఎలా అధిగమించనున్నారు?

వంశధార కాలువలు ఆధునీకరణకు నోచుకోకపోవడంతో గట్లు కొంత బలహీనంగా ఉన్న మాట వాస్తవమే. గత ఖరీఫ్‌లో ఎడమ కాలువ సామర్థ్యం 2,400 క్యూసెక్కులు కాగా, గత ఖరీఫ్‌లో రెండు వేల వరకు విడిచిపెట్టాం. కుడి కాలువ సామర్థ్యం 870 క్యూసెక్కులు కాగా, 700 క్యూసెక్కుల వరకు నీళ్లు ఇచ్చాం. ఈ ఏడాదీ అదే స్థాయిలో నీటిని అందించగలమని భావిస్తున్నాం.

జిల్లాలో లష్కర్ల నియమాకాల పరిస్థితి ఏమిటి?

వంశధార కాలువల్లో నీటి నియంత్రణ కోసం ప్రతి ఏడాది జులై నుంచి అక్టోబరు వరకు లష్కర్ల అవసరం ఉంటుంది. వంశధార, కుడి ఎడమ కాలువలకు మొత్తం 260 మంది లష్కర్లు కావాలి. ప్రస్తుతం 98 మంది పనిచేస్తున్నారు. సాగునీటి రెగ్యులేషన్ కోసం జిల్లా అవసరాల దృష్ట్యా 130 మంది కావాలని ప్రభుత్వాన్ని అడిగాం. ప్రభుత్వం అనుమతిస్తే అదనంగా లష్కర్లను నియమిస్తాం. లేకుంటే పాత వారినే మళ్లీ కొనసాగిస్తాం.

సాగు నీటి సమస్యలకు షట్టర్లు పాడవడం, కొత్తవి ఏర్పాటు చేయకపోవడమే ప్రధాన కారణమన్న విమర్శలు ఉన్నాయి?

షట్టర్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై 2009లో సిఐడి కేసు నమోదు చేసింది. దీనిపై నేటికీ హైకోర్టులో విచారణ సాగుతోంది. విచారణ పెండింగ్‌లో ఉండడంతో కాలువలపై కొత్త షట్టర్లను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో కొత్తగా షట్టర్లు ఏర్పాటు చేసుకోలేక, పాడైన వాటితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లాం. ప్రభుత్వం చొరవ చూపితే సమస్య పరిష్కారమయ్యే అవకాశముంది.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

లౌకికశక్తులు ఏకం కావాలి

భరత్ బచావో జిల్లా కన్వీనర్ పరమేశ్వరరావు

ప్రజాశక్తి- పలాస

దేశంలో కేంద్ర ప్రభుత్వం రామాలయం, కాశీ, మధుర పేర్లతో మత ఉన్మాదాన్ని సృష్టించి ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని భారత్ బచావో జిల్లా కన్వీనర్ పి.పరమేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. కాశీబుగ్గ అంబేద్కర్ విగ్రహం వద్ద భారత్ బచావో పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో సంఘ పరివార్ ఫాసిస్టు శక్తులు దేశ ప్రజలను తీవ్ర కష్టాల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆస్తులు, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీల పరం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిఎస్‌టి పేరుతో రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రాన్ని యాచించే భిక్షగాళ్లుగా మార్చారన్నారు. గోరక్షణ పేరుతో నిత్యం మైనారిటీలను, దళితులను హత్యాకాండలకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్-చైనాల సరిహద్దు సమస్యల పేరుతో నిత్యం ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. దేశభక్తి పేరుతో ప్రజలను సక్రమంగా ఆలోచించకుండా చేసి తమ లోపాలను కప్పి పుచ్చుకుంటున్నారన్నారు. రాజ్యాంగ వ్యవస్థ ఎలక్షన్ కమిషన్, ఈడి, ఐటి, సిబిఐ, ఎన్ఐఎ తదితర సంస్థలను వ్యతిరేకించే వారి పైన ఉసిగొల్పి దాడులకు పాల్పడడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాలను వ్యతిరేకించే వారిని దేశద్రోహులు అని ముద్రలు వేసి నిర్బంధానికి గురి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మహిళా సంఘం నాయకురాలు అరుణ, నాగమణి, వంకల మాధవరావు, తామాడ త్రిలోచన, కోదండం, దాసరి శ్రీరాములు, పుచ్చ దుర్యోధన పాల్గొన్నారు.



ట్రోఫీని అందజేస్తున్న సువ్వారి గాంధీ

క్రికెట్ టోర్నీ విజేత మజ్జిలిపేట

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కొంచాడ పంచాయతీ యాగాటపేటలో నిర్వహిస్తున్న 'ఫ్రెండ్స్ 11 క్రికెట్ టోర్నమెంట్' పోటీల విజేతగా మజ్జిలిపేట జట్టు, రన్నర్‌గా దల్లవలస జట్లు నిలిచాయి. 20 రోజులుగా జరుగుతున్న ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 64 జట్లు పాల్గొన్నాయి. ఆమదాలవలస నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకులు సువ్వారి గాంధీ చేతులు మీదుగా విజేతలుగా నిలిచిన జట్లకు ట్రోఫీలను అందజేశారు. విజేతగా నిలిచిన మజ్జిలిపేట జట్టుకు రూ.10 వేలు నగదుతో పాటు, ట్రోఫీని అందజేశారు. అలాగే రన్నర్‌గా నిలిచిన దల్లవలస జట్టుకు రూ.5 వేలు నగదుతో పాటు ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి పెయ్యిల సరస్వతి, వైస్ సర్పంచ్ పావని, ఎంపిటిసి మాజీ సభ్యులు కోరుకొండ సాయికుమార్, పెయ్యిల ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

80 కిలోల జీడి పిక్కల బస్తాకు మద్దతు ధర రూ.16 వేలు ప్రభుత్వం ప్రకటించాలని, అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలుచేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి, గునుపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఈ నెల 6న పలాస-కాశీబుగ్గలో నిర్వహిస్తున్న జీడి రైతుల నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని రైతులను, ప్రజలను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి పంటకు గిట్టుబాటు ధర లేక ఉద్దానం రైతాంగం ఉక్కిరి బిక్కిరవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పంటకు గిట్టుబాటు ధర లేక అవకాశాలను ఆసరా చేసుకొని అమ్ముకోలేక మంచి ధర వచ్చేవరకు నిల్వ చేసే సామర్థ్యం లేక రైతులు మానసిక సంఘర్షణకు లోనవుతున్నారని అన్నారు. పలాస-కాశీబుగ్గ పట్టణానికి జీడి ఉత్పత్తులు వలనే మంచి పేరు వచ్చిందని, జీడి వ్యాపారులు ఆ దిశగా ఆలోచించి రైతులకు అండగా నిలవాలని అన్నారు. పలాసలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రైతులకు పంట రుణాలు దానిపై, బతుకుతున్న వ్యాపారులకు అనుబంధ పరిశ్రమలు స్థాపనకు ప్రోత్సాహకాలు, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. గతంలో వజ్రపుకొత్తూరు మండలంలో ఏర్పాటు చేస్తామన్న జీడి ప్రాంతీయ పరిశోధన కేంద్రం పనులకు అతీగతీలేదని అన్నారు. రాజకీయ పార్టీలు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో రైతులు వ్యవసాయానికి దూరమయ్యే గడ్డు పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత రైతులకు ఉద్యమాలు కొత్తేమీ కాదని జరగబోయే ర్యాలీకి ప్రతి గ్రామం నుంచి రైతులు ప్రజలు విరివిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వజ్రపుకొత్తూరు మాజీ సర్పంచ్ గురయ్యనాయుడు, తమ్మినాన భాస్కర్, కుత్తుమ వినోద్ కుమార్, అక్కుపల్లికి చెందిన కారి పురుషోత్తం, మద్దు కామేశ్వరరావు, మద్దు శంకర్, గునుపల్లిలో వాసుపల్లి సాంబమూర్తి, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పలాస : జీడి పిక్కల 80 కేజీల బస్తా రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం



వజ్రపుకొత్తూరు : ప్రచారం చేస్తున్న నాయకులు

నిర్వహించనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని రంగోయి, మామిడిమెట్టు తదితర ప్రాంతాల్లో రైతు సంఘం నాయకులతో కలిసి పోస్టర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద రుణాలు మంజూరు చేయాలని, ప్రాంతీయ జీడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేసి, నాణ్యమైన మొక్కలు, ఎరువులు, పురుగు మందులు ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న శేషగిరి

ప్రజాశక్తి- టెక్కలి

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులందరినీ మోసం చేశారని, ఈ నాలుగేళ్ల పాలనలో అన్నదాతలు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో తీవ్ర నష్టాల్లో కూరుకుపోతున్నారని అన్నారు. రైతు భరోసా, పంట నష్టం పరిహారం, సున్నా వడ్డీ రుణాలు, ధాన్యం కొనుగోళ్లు, రైతులకు యంత్ర పరికరాలు పంపిణీలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. రూ.4.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ, రూ.4 వేల కోట్లతో ప్రకృతి విపత్తుల నిధి ఏర్పాటు చేస్తామని మాటిచ్చి మరిచిపోయారని అన్నారు. రైతు భరోసా కేంద్రాల పేరుతో ఆర్భాటమే కానీ వ్యవసాయానికి, రైతుకు ఉపయోగపడలేదని అన్నారు. నాటి టిడిపి హయాంలో రైతులకు ఉన్న పథకాలకే పేరు మార్చి అందిస్తున్నారని అన్నారు. సమావేశంలో కార్యదర్శి మామిడి రాము, రైతు కమిటీ అధ్యక్షులు అట్టాడ రవిప్రసాద్, పోలాకి షణ్ముఖరావు, గండేటి భీమారావు, గేదెల సంజీవిరెడ్డి, జనపాన తేజ, కెల్లి శ్రీరాములు, ఇప్పిలి జగదీష్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జనసేన సంఘీభావం

ప్రజాశక్తి- పొందూరు

మేజర్ పంచాయతీ పొందూరు పట్టణంలో నాలుగు రోజులుగా తమ సమస్యలు పరిష్కారం కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపడుతున్న రిలే నిరాహారదీక్ష చేస్తున్నారు. ఈ మేరకు మండలం జనసేన పార్టీ ఆదివారం తమ సంఘీభావాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు యలకల రమణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు, ఇఎస్ఐను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల నాయకులు గొర్లె వసంతకుమార్, జరజాపు గణేష్, లోలుగు సురేష్, దినేష్, కోరాడ రాజు,



కార్మికుల రిలేదీక్షలో పాల్గొన్న జనసేన నాయకులు

పారిశుధ్య కార్మికులు పి.నాగరాజు, పి.కనకరాజు, పి.కొండయ్య, సిహెచ్.కనకమ్మ, పి.కనకలక్ష్మి, పి.బుజ్జి పాల్గొన్నారు.

నైతిక బాధ్యత కేంద్రానిదే

ప్రజాశక్తి- టెక్కలి

ఒడిశా రాష్ట్రం బాలేశ్వర్ వద్ద జరిగిన రైలు ప్రమాదానికి పూర్తి నైతిక బాధ్యత కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిదేనని, ఈ ఘటనపై రైల్వే శాఖమంత్రి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లా డారు. దేశంలో అతిపెద్ద రైల్వే వ్యవస్థను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడంలో భాగంగా ప్రయివేట్ వ్యక్తులను నియమించారని, ఈ ప్రమాదానికి వారి బాధ్యతా రాహిత్యం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. వందేభారత్ రైళ్ల పేరుతో పేదలకు రైళ్ల ప్రయాణం దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఆజాదీగా అమృతోత్సవం పేరుతో దేశం సాధించిన ప్రగతి ఏమిటని ప్రశ్నించారు. ఈయనతో పాటు నియోజకవర్గ నాయకులు కోత మధుసూదనరావు, పొట్నూ రు ఆనందరావు, శాసుమహంతి ధర్మారావు ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌లో విద్యార్థుల సత్తా

కవిటి : జాతీయ ఉపకార వేతనాల కోసం ఇటీవల నిర్వహించి పరీక్షా ఫలితాల్లో మండలం నుంచి 13 మంది విద్యార్థులు ఎంపికై సత్తా చాటారని ఎంఇఒ ధనుంజయ్ మజ్జి ఆదివారం తెలిపారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు, రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు, రాజపురం మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఒక జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు విద్యార్థులను అభినందించారు.



బైక్‌పై నుంచి జారిపడి మహిళ మృతి

ప్రజాశక్తి- పొందూరు



భారతి (ఫైల్)

మండలంలోని దల్లవలస పంచాయతీ గొర్లెవానిపేట సమీపంలో బైక్ నుంచి జారిపడి అలమాజీపేటకు చెందిన కూన భారతి (55) శనివారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో దల్లవలస బ్యాంకుకు వెళ్లి పని ముగిసిన తరువాత అలమాజీపేటకు చెందిన గెడ్డవలస హరినాథ్‌కు చెందిన బైక్‌పై ఇంటికి వెళ్తుంది. గొర్లెవానిపేట సమీపంలో కిందకు జారిపడిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయం కావడంతో 108 వాహనంలో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి 11 గంటల సమయంలో పరిస్థితి విషమించి మృత్యువాత పడింది. ఈమె కుమారుడు అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో హిజ్రా మృతి



అరుణ్‌కుమార్ మృతదేహం

కోటబొమ్మాళి: మండలంలోని జాతీయ రహదారి కన్నేవలస కూడలి వద్ద శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మందస మండలం పద్మాపురానికి సవర అరుణకుమార్ అనే హిజ్రా గుర్తు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హిజ్రా అరుణకుమార్ రోడ్డు దాటుతుండగా... నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వెళ్తు గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో అరుణకుమార్ అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మరో హిజ్రా బోనేల వంశీకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఘటనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ ఎస్.కె.మహ్మద్అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



గొడుగును పంపిణీ చేస్తున్న శ్రీకాంత్

గొడుగుల పంపిణీ


పలాస: పలాస-కాశీబుగ్గ పట్టణంలోని తోపుడు బండ్ల వర్తకులకు ఆదివారం మంకినమ్మ తోపుడు బండ్ల వర్తక సంఘం గౌరవ అధ్యక్షులు దువ్వాడ శ్రీకాంత్ గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండకు ఎండి, వర్షాలకు తడిసి నిరంతరం కష్టంతో కుటుంబం పోషణ కోసం బతుకు జీవనం సాగిస్తున్న తోపుడు బండ్ల వర్తకులకు రూ.1.25 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన 120 మందికి గొడుగులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. వేసవి, వర్షాకాలంలో తోపుడు బండ్ల వ్యాపారులకు వ్యాపారం చేసుకోవడానికి గొడుగులు చాలా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కొత్తకోట రమణ, సకలాబత్తుల తవుడు, బమ్మిడి చూడామణి, ఇంటివెనుక వీరాస్వామి పాల్గొన్నారు.



అచ్చెన్నకు ప్రసాదాన్ని అందజేస్తున్న టిడిపి నాయకులు

అచ్చెన్నను కలిసిన నాయకులు

కోటబొమ్మాళి: ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల మధ ఎండగట్టేందుకు టిడిపి నాయకులు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలో తన క్యాంపు కార్యాయలంలో అచ్చెన్న ఉన్నారన్న విషయం తెలుసుకున్న కార్యకర్తలు, నాయకులు ఆదివారం పెద్ద ఎత్తున వచ్చి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ అరాచక పాలన చేస్తుందని. దీంతో ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ప్రశాంతంగా టాలెంట్ టెస్టు

రణస్థలం రూరల్: ఇన్‌స్పెయిర్ ఫ్రీ ఎడ్యుకేషనల్ (ఐఎఫ్ఇ) టాలెంట టెస్టు ఆదివారం ప్రశాంతంగా ముగిసిందని ఐరిస్ స్కూల్ డైరెక్టర్ కొమనాపల్లి హరికృష్ణ తెలిపారు. ఈ పరీక్షకు 5 నుంచి 9 వరగతి చదివిన 92 మంది విద్యార్థులు పాల్గొన్నారని అన్నారు. ఒక్కో తరగతిలో మంచి మార్కులు సాధించిన మొదటి పది మంది విద్యార్థులకు ఉచిత విద్య, స్కాలర్‌షిప్‌లు పదో తరగతి పూర్తయ్యే వరకూ పారితోషికాలు అందజేస్తామని చెప్పారు. ఈ ఫలితాలను 8వ తేదీన విడుదల చేస్తామని తెలిపారు.

తలసేమియా చిన్నారికి పింఛను

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురానికి చెందిన రెండేళ్ల బాలుడు సాన రోహిత్‌కుమార్‌కు పింఛను మంజూరైందని, పింఛన్‌ను ఆదివారం అందజేశామని సర్పంచ్ గుజ్జు మోహనరావు తెలిపారు. రోహిత్‌కుమార్ తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వైఎస్ఆర్ పింఛను కానుకలో భాగంగా వైద్య ఖర్చుల నిమిత్తం నెలకు రూ.పది వేలు మంజూరైందని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పింఛను అందజేస్తున్న సర్పంచ్ మోహనరావు



మాట్లాడుతున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

సబ్ కలెక్టర్‌ను కలిసిన వాణి

ప్రజాశక్తి- టెక్కలి

సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డిని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దువ్వాడ వాణి శనివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తొలిసారిగా సబ్ కలెక్టర్‌తో వాణి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గం పరిధిలోని నాలుగు మండలాల్లో ఉన్న పలు సమస్యలు పరిష్కారంలో రెవెన్యూ పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రధానంగా జగనన్న ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవకతవకలపై దృష్టిసారించాలన్నారు. కాలనీ నిర్మాణాలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ... తమ పరిధిలోని అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని మాట ఇచ్చారు.

ప్రతిభకు ప్రోత్సాహం

కవిటి: ఆర్థికలేమితో బాధపడుతున్న ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడంలో చింతామణి ట్రస్టు ఆద్వర్యాన బెందాళం ఇందిరాదేవి కుటుంబం చేస్తున్న కృషి అభినందనీయమని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. ఒంగోలు కిమ్స్‌లో నర్సింగ్ చదువుతున్న చిన్న ఎర్ర గోవింద పుట్టుగకు చెందిన గోవింద భాగ్యం అనే పేద విద్యార్థికి చింతామణి అమ్మవారి ట్రస్టు (హైదరాబాద్) వారి ఆర్థిక సహాయంతో ఆదివారం రూ.20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఒంగోలులో నర్సింగ్ చదువుతున్న మండలానికి చెందిన



నగదును అందిస్తున్న ట్రస్టు సభ్యులు

భాగ్యలక్ష్మి తన కాలేజీ ఫీజుల నిమిత్తం చింతామణి ట్రస్టును సంప్రదించానని అన్నారు. వెంటనే ట్రస్టు ఆ విద్యార్థికి సాయం అందజేశారని అన్నారు. పాండవ శేఖర్, ఆరింగి మధు, పొల్లాయి ఉమ, జన్ని లోకానాథం, టి.మోహన రావు, పి.సింహచలం, బావన రవి, కె.జ్ఞానసంద, టి.వి.రమణ, పొల్లాయి అప్పారావు పాల్గొన్నారు.



బహుమతులతో విద్యార్థులు

నందిగాం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- నందిగాం

తిరుపతి సమీపం నాయుడుపేటలో ఆదివారం నిర్వహించిన ఇంటర్ స్టేట్ రాష్ట్రస్థాయి నాలుగు కిలోమీటర్ల పరుగు పందెం పోటీలో అండర్-14 విభాగంలో నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. జి.అభిరామ్ ప్రథమ స్థానంలో, కె.గణేష్ ఐదో స్థానంలో నిలిచారు. అభిరాంకు రూ.5 వేలు నగదు, సైకిల్ అందజేశారు. గణేష్‌కు రూ.వెయ్యి నగదు అందజేశారు. ఐదు కిలోమీటర్ల పరుగు పందెం అండర్-18 విభాగంలో బి.మోక్ష ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈయనకు రూ.4 వేలు నగదు అందజేశారు. విజేతలకు, కోచ్ వెంకటరావుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యర్నాగుల హరిబాబు, పీడీ గజారావు శ్రీనివాసరావులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రైతుల అభివృద్ధి టిడిపితోనే సాధ్యం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రైతుల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు అన్నారు. మండలంలోని అర్జునవలసలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఏరువాక కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నాగలి పట్టి దున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల పంటలు బాగా పండాలని, రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని అన్నారు. టిడిపి హయాంలో ఏరువాక కార్యక్రమం ఘనంగా నిర్వహించేశారని అన్నారు. వైసిపి పాలన వచ్చిన తర్వాత ఇటువంటి కార్యక్రమాలను తుంగలో తొక్కిందని



ఏరువాకను ప్రారంభించిన రామ్ మల్లిక్‌నాయుడు

ఆరోపించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్షణరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు లెంక శ్యామలరావు, పిసిని జగన్నాథంనాయుడు, మాజీ సర్పంచ్ కోట్ల అప్పలనాయుడు, కనకారావు, దన్నాన సత్తిబాబు, వంశి పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న బాలకృష్ణ

ఉన్నత విద్యను అభ్యసించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నతిగా స్థిరపడాలని విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సింహాద్రి ధనుంజయ ఆచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తాళాబత్తుల బాలకృష్ణ అన్నారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సామాజిక భవనంలో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపించిన 60 మంది విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది పదిలో 589 మార్కులు సాధించిన వమరవెల్లి హన్సిక ప్రథమ బహుమతిగా రూ.5,016, 585 మార్కులు సాధించిన పోలాకి వేదవేశ్ ద్వితీయ బహుమతిగా రూ.3,016, 580 మార్కులు సాధించిన పి.వి.ఎస్.ఎస్.నిఖిల్ తృతీయ బహుమతిగా రూ.2,016 నగదును బాలకృష్ణ అందజేశారు.

ఏటా ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల విద్యార్థులకు పారితోషకం అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యా సంస్థల అధినేత చెబోలు దుర్గాప్రసాద్, ఎం.ఆర్.సిహెచ్.కుమార్, పలాస నియోజకవర్గ అధ్యక్షులు కొత్తపల్లి చిన్నాచారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్రాల విష్ణు, గౌరవ అధ్యక్షులు సింహాద్రి గోపాలకృష్ణ, కోశాధికారి అనుకోదు శ్రీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో హెల్పింగ్ వారియర్స్ టీం ఆధ్వర్యాన ఆదివారం ఓపెన్ జిమ్ ప్రారంభించారు. గ్రామంలో యువత ఎక్కువగా ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నావీ ఉద్యోగాల్లో చేరేందుకు ఓపెన్ జిమ్ ఎంతగానో ఉపయోగపడుతోందన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుకు విరాళాలు ఇచ్చిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో హెల్పింగ్ వారియర్స్ సభ్యులు సారువకోట చలపతిరావు, పూన హరికష్ణ, లోకనాథం, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న వారియర్స్ సభ్యులు

ఘనంగా 'బాలు' జయంతి

ఇచ్ఛాపురం : కీర్తిశేషులు ఎస్.పి.బాలసుబ్రమణ్యం 77వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో వెంకటేశ్వర మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ, బాలు మ్యూజిక్ అవార్డు గ్రహీత చిన్నా గురు స్వామి, నాట్య గురువు శతి పట్నాయక్ ఆధ్వర్యాన బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. బాలు పాడినటువంటి దేవుళ్లు చిత్రంలో జయ జయ శుభకర వినాయక, స్వర్ణకమలం చిత్రంలో ఘల్లు ఘల్లు మంటూ, శంకరభరణం చిత్రంలో దొరకునా ఇటువంటి సేవ, బాలు పాటలకు నృత్యాన్ని చేసి అలరించారు. బాలు లేకపోయినా ఆయన పాటలు బతికే ఉన్నాయని, ఎప్పటికీ బతికి ఉంటాయని ఆయనను స్మరించుకున్నారు.

అలాగే సేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఏడు మండలాల



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

కళాకారులు సంక్షేమ సంఘం జోనల్ కమిటీ అధ్యక్షులు పిలక సోమేష్ చంద్ర, స్వేచ్ఛా నృత్య తరంగిణి అధ్యక్షులు కె.గోవిందరావు, జూనియర్ ఘంటసాల బిరుదాంకితులు ఎం.కె.రావు. దీప ప్రజ్వలన బాలు రాగామాలిక గ్రూప్ సభ్యులంతా కలిసి బాలు పాటలను పాడుకుంటూ నివాళ్లర్పించారు. కీబోర్డ్ హేమంత్ బాడిత్య వాయించగా, తబలా నితిన్ బాదిత్య కొట్టగా, హరిప్రసాద్ బడిత్య, హరిదాస్ బెహరాలు పాటలు పాడారు.

45 పైసలకే రూ.10 లక్షల ప్రయాణ బీమా

ప్రజాశక్తి- రణస్థలం

ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకు పెరుగుతోంది. చనిపోయిన వారిలో, కుటుంబం మొత్తానికి జీవనాధరమైన వ్యక్తులు ఉండవచ్చు. వాళ్ల మృతితో ఆ కుటుంబం ఆర్థిక, సామాజిక పరిస్థితి ఒక్కసారిగా తల్లకిందులవుతుంది. ఈ పరిస్థితుల్లో, ట్రైన్ ట్రావెల్ ఇన్స్యూరెన్స్ ఆర్థికంగా ఆదుకుంటుంది. దీనికి అయ్యే ఖర్చు కూడా నామ మాత్రం. కేవలం 45 పైసల ఖర్చుకే రూ.10 లక్షల బీమా అందుతుంది.

మీరు కూడా తరచుగా/అరుదుగా రైలు ప్రయాణం చేస్తుంటే, ఇప్పుడు చెప్పబోయే అతి ముఖ్యమైన విషయాన్ని కచ్చితంగా గుర్తు పెట్టుకోవాలి. మీరు ఇప్పటివరకు చాలాసార్లు రైలు ప్రయాణం చేసినా, ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకుని ఉండరు. రైలు ప్రయాణం కోసం ఆన్‌లైన్ టిక్కెట్ బుక్ చేసే సమయంలో, ట్రావెల్ ఇన్స్యూరెన్స్ ఆప్షన్ కూడా కనిపిస్తుంది. దీనిని టిక్ చేయండి. దీనివల్ల, కేవలం 45 పైసలకే రూ.10 లక్షల బీమా కవరేజ్ అందుతుంది. రైలు ప్రయాణ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే, ఆ బీమా డబ్బు మీ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తుంది.

ఆన్‌లైన్‌లో రైలు టిక్కెట్లను టపాటపా బుక్ చేసుకునే పాసింజర్లలో చాలామంది ట్రావెల్ ఇన్స్యూరెన్స్ ఆప్షన్‌ను ఎంచుకోరు. ఏం కాదులే అన్న నిర్లక్ష్యం ఒక కారణమైతే... అసలు అలాంటి ఆప్షన్ ఒకటి ఉందని తెలియకపోవడం మరొక ప్రధాన కారణం. బీమా కోసం చెల్లించాల్సిన మొత్తం ఒక్క రూపాయి కన్నా తక్కువే కాబట్టి, పోతేపోనీ కోవాలి. మన చేతుల మీదుగా ఎన్ని రూపాయలు వృథాగా ఖర్చు కావడం లేదు?, కానీ, ఇది మాత్రం వృథా కాదు. ఒడిశా లాంటి సంఘటనలు సంభవించినప్పుడు మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి రూ.10 లక్షల వరకు కవరేజ్ అందుతుంది. గాయపడిన వారికీ బీమా కవరేజ్ ఉంటుంది.

నామినీ పేరు తప్పనిసరి

రైలు ప్రయాణం కోసం ఆన్‌లైన్ టిక్కెట్ బుక్ చేస్తున్నప్పుడు ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్‌లో, యాప్లోనూ ఇన్స్యూరెన్స్ ఆప్షన్ కనిపిస్తుంది. ఆ ఆప్షన్ ఎంచుకున్న తర్వాత మీ మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీకి లింక్ వస్తుంది. ఆ లింక్‌ను బీమా సంస్థ పంపుతుంది. లింక్ మీద క్లిక్ చేస్తే మరో పేజీ ఓపెన్ అవుతుంది. అక్కడ నామినీ వివరాలు తప్పనిసరిగా పూరించాలి. ఎందుకంటే బీమా పాలసీలో నామినీ పేరు ఉంటే బీమా క్లెయిమ్ పొందడం సులభం అవుతుంది.

ఎంత క్లెయిమ్ పొందుతారు

రైల్వే ట్రావెల్ ఇన్స్యూరెన్స్ ఉన్న సందర్భంలో, రైలు ప్రయాణ సమయంలో ప్రయాణికుడికి ఏదైనా ప్రమాదం జరిగితే, జరిగిన నష్టాన్ని బట్టి బీమా మొత్తం అందుతుంది. రైలు ప్రమాదంలో ప్రయాణికుడు మృతి చెందితే అతని కుటుంబానికి రూ.10 లక్షలు అందుతుంది. ప్రమాదంలో రైల్వే ప్రయాణికుడు పూర్తిస్థాయి అంగవైకల్యం చెందినా బీమా కంపెనీ అతనికి రూ. 10 లక్షలు పరిహారం ఇస్తుంది. పాక్షిక అంగవైకల్యానికి రూ.7.5 లక్షలు, గాయాలైతే రూ.2 లక్షలను ఆస్పత్రి ఖర్చులుగా చెల్లిస్తుంది. రైలు ప్రమాదం జరిగిన 4 నెలల లోపు క్లెయిమ్ చేసుకోవచ్చు. బీమా కంపెనీ కార్యాలయాన్ని వెళ్లి, వాళ్లు అడిగిన వివరాలు, పత్రాలు సమర్పించి బీమా మొత్తాన్ని పొందవచ్చు. భారతీయ రైల్వే అందిస్తున్న ఈ అవకాశాన్ని మీరు గతంలో పెద్దగా పట్టించుకోకపోయి ఉండవచ్చు. ఇకపై మాత్రం మరిచిపోవద్దు. మీరు చూపే చిన్నపాటి శ్రద్ధ, మీ కుటుంబం మొత్తానికి ఆర్థిక రక్ష.